సీరియల్ కథ :

# ప్రేమ పుష్పాలు!



★

రచన:

శ్రీ బుద్ధిరాజు నరసింహారావు

(గతసంచిక తరువాయి)

బ్రయటకు వచ్చిన తర్వాత కూడా అతని వెంటే నడిచింది జయసుధ.

'జయసుధగారూ. ఈ రోజు నాకు చాలా తల నొప్పిగా వుంది. శెలవు తీసుకున్నాను. సాయంత్రం వీలుచూసుకుని ప్రేమ్‌కుమార్ యింటికి వెళ్తాను. మీ ఎడ్రస్ నాకు తెలుసు కదా. వచ్చి ఏ జవాబూ చెప్తాను.'

'సరే.'

చక్రవర్తి వెళ్ళిపోయాడు.

జయసుధ వెనక్కి తిరగ్గానే మీనా, గీతా ఎదురయ్యారు.

'అమ్మాయిగారూ! ఏదో విశేషమున్నట్లుందే!' మీనా చిరునవ్వు విసురుతూ అడిగింది.

గీత కసిగా జయసుధ వైపు చూస్తూ, 'ఈ ఎర్రగా బుర్రగావున్న అమ్మాయిలను అసలు నమ్మలేం. నిన్న మొన్నటి వరకూ ఒకరితో ప్రేమకలాపాలు జరిపి, ఇవాళ యింకొకరిని....' అని ఏదో అనబోయింది.

కాని ఆమె మాట పూర్తికాకుండానే, 'ఓహో. ఏమిటా కబుర్లు!' అంది జయసుధ విసుగ్గా.

'అహా. ఏమి కోపంరా బాబూ! అవునూ. నాకు తెలీక అడుగుతాను. ఆ రోజు చక్కని లెంపకాయ కొడితే మా లైన్ క్లియర్ కదా అని నేనూ, గీతా పోటీ పడుతూ వుంటే - మళ్ళా మధ్యలో నీ వ్యవహారమేమిటి?'

'అలాంటిదేదీ లేదు బాబూ. నన్ను సతాయించకండి!'

'ఎందుకు సతాయించరు? అసలు నీ కిది న్యాయంగా వుందా? నిన్న మొన్నటి దాకా ప్రేమ్‌కుమార్‌తో ప్రేమ కలాపాలు జరుపలేదా?' మీనా కోపంగా అడిగింది.

'కాదనను. కాని అది నా పొరపాటు. ప్రేమ్‌కుమార్ మనిషి కాదు. పశువుతో సమానం!'

'అయ్యో. పెళ్ళి కాకుండానే గుర్తించేసావే?' గీత చలాకీగా నవ్వింది.

జరిగింది చెప్పడానికి ఇష్టం లేక జయసుధ మౌనంగా ఊరుకుంది.

'సరేలే, జరిగిందేదో జరిగిపోయింది. ఇంతకీ ముఖ్యమైన విషయమేమిటంటే - చాలా రోజులకి ప్రేమ్ ఇవాళే కాలేజీకి వచ్చాడు. దర్శనమైందా?'

'ఏదీ?' అంటూ జయసుధ నలుదిక్కుల చూడసాగింది. ఆమె గుండె జోరుగా కొట్టుకుంటోంది.

'నిజం చెప్పనా జయా. పాపం. నీ ప్రేమ గట్టిముద్రే వేసినట్లుంది. చెదిరిన జుత్తూ, మాసిన గడ్డం, నలిగిన బట్టలతో నిజంగా మజ్నూలా వున్నాడు. కళ్ళు కూడా లోతుకి పోయాయి. చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆ షోకీలా అబ్బాయేనా ఈ ప్రేమ్ అని!' అంది గీత.

'పాపం! ఓ రెండు ప్రేమవాక్యాలు విసిరి రాకూడదా? కోలుకుంటాడేమో!' మీనా చిలిపి గొంతుక.

ఎలాగైతేనేం వారిని తప్పించుకుని జయసుధ గార్డెన్ వేపు వెళ్ళింది.

మామిడిచెట్టు నీడన కూర్చున్న ప్రేమ్ విచారంగా మల్లి పొదవైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

జయసుధకి అతడిని చూడగానే ఎక్కడిలేని కోపం, అసహ్యం పుట్టుకు వచ్చాయి.

'హుం! మాసిన గడ్డంతో వెర్రివాడిలా నటించి మళ్ళీ వలలో వేసుకుని మోసం చేద్దామనుకుంటున్నాడు కాబోలు.' అనుకుంది జయసుధ మనసులో.

ఏదో నిర్ణయించుకున్నట్లు తిన్నగా అతని దగ్గరగా వెళ్ళి నిలబడింది.

ప్రేమ్‌కుమార్ ఆమెని గమనించలేదు.

ఆమె చిన్నగా దగ్గగానే హఠాత్తుగా తృళ్ళిపడి వెనక్కి తిరిగి చూసాడు.

'ఓ. జయా?'

'ఆం - నేనే! ఏం? ఆశ్చర్యంగా వుందా?'

'లేదు జయా. అసలు నేనే నిన్ను కల్సుకుందామనుకున్నాను. కాని ధైర్యం చాలక ఊరుకున్నాను. జయా! ఆ రోజు జరిగింది మరచి పోలేవా?' దీనంగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ప్రేమ్‌కుమార్.

కాని జయసుధ తీక్షణమైన చూపులను తట్టుకోలేక తన దృష్టిని పక్కకి తిప్పుకున్నాడు. ఆమె కళ్ళల్లో తన పట్ల అంతులేని అసహ్యం స్పష్టంగా గోచరిస్తోంది.

'మరచి పోవడమా? నీ లాంటి రాక్షసుడిని మరచి పోవడం ఈ జన్మలో సాధ్యపడదు. ప్రేమ్‌కుమార్! నీ వద్ద నేను వ్రాసిన లేఖలూ, ఫోటో వున్నాయి. నీవు తలచుకుంటే వాటిని ఆధారంగా తీసుకుని, రభస చేసి నా జీవితాన్ని సర్వనాశనం చెయ్యగలవు. అంతే కదా నీవు చేయగలిగేది? అయినా దానివల్ల ప్రయోజనమేమీ వుండదు.




ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్,

# - జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెశర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

——————— వివరములకు ———————

Grams : "NAIDUBROS" Phone Office : 24997 Works : 22757

**THE EL-P-EM INDUSTRIALS**

393, Mettupalaym Road, (P.B. No. 1053) COIMBATORE-641 002

**SALES BRANCHES :-**

**112, Zeera, Secunderabad - 3.**

**13/85, Jayachamarajendra Road, Bangalore - 2.**

**10, Municipal Market Building, Kokkalai, Trichur - 1.**

విద్ధపడిన వారికి భయమేమిటి? ఇప్పటికీ నీలో మంచి మర్యాదా కాస్తయినా మిగిలి వుంటే, అవి నా కిచ్చెయ్య మంటున్నాను. అప్పుడు నా దారి నాది, నీ దారి నీది.'

'జయా!'

'అందమైన ఆడదాని వెంట పడి, వాళ్ళ అమాయకత్వాన్ని ఆధారంగా తీసుకుని, మోసగించి, వారిని విలాస వస్తువులుగా ఉపయోగించుకునే వారిని ఎప్పుడూ ఏ ఆడదీ క్షమించదు. నీ మంచి మాటలతో - సినిమా స్టయిల్ మజ్నూలా మళ్ళా నన్ను లొంగ దీసుకుందామనుకుంటే అది వ్యర్థ ప్రయత్నం. ఏ జన్మలోనైనా సాధ్య పడదని దృఢంగా చెప్తున్నాను. నా శరీరంలో ప్రతి అణువు నీ వంటే అసహ్యంతో నిండుకుంది.'

జయసుధ ఆవేశంతో రెచ్చిపోయింది.

ప్రేమ్‌కుమార్ తల దించుకుని మెల్లిగా అన్నాడు. 'ఎంతమాటన్నావు జయా! మానవు డన్నప్పుడు తెలిసో తెలియకనో కొన్ని తప్పులు జరిగితీరుతాయి. నా తప్పులు సరిదిద్దుకొనే అర్హతకూడా నాకు లేదా?'

'నీతో వాదించేటంత వోపిక నాకు లేదు ప్రేమ్‌కుమార్, మర్యాదగా అవి నాకిచ్చేయి. కాదంటే యివ్వనని ఒక్క మాట చెప్పు, నే వెళ్తా!' ముక్తసరిగా అనేసింది జయసుధ.

'నన్నొక్కసారి క్షమించలేవా జయా. జీవితంలో మరెన్నడూ తప్పుమార్గాలలో పడనని వాగ్దానం చేస్తున్నాను.' భారంగా అన్నాడు ప్రేమ్‌కుమార్.

'మరి వస్తాను.'

జయ వెనక్కి తిరిగి బయల్దేరబోయింది.

'ఆగు జయా. యివిగో తీసుకో. నీవు వ్రాసిన లేఖలూ, ఫోటో. నావద్ద వుంటే నీ చివరి గుర్తులుకూడా దూరం చేసుకుంటున్నాను. నీకళ్ళల్లో నాపట్ల ఆ అంతులేని అసహ్యం నేను భరించలేను జయా. మరెన్నడూ నీవద్దకు వచ్చి నిన్ను బాధపెట్టను. ఈరోజే ఈ ఊరు వదలి వెళ్ళిపోతున్నాను. కాని నాదో చిన్న మనవి. నాతప్పు మరచిపోయి, నిర్మలమైన మనసుతో నన్ను క్షమించినరోజే నాకు పండుగరోజు. నాజీవితం సార్థకమయ్యేరోజు. వస్తాను జయా.' బొంగురుపోయిన గొంతుకతో అని లేచాడు ప్రేమ్‌కుమార్.

అతని కంఠంలో ఎక్కడలేని బాధా తొణికిసలాడింది. జేబులోంచి లేఖలూ, ఫోటో తీసి ఆమెచేతిలో పెట్టాడు.

జయసుధ అవి అందుకుంది,

C.K.C

ELEPHANT BRAND

ఏనుగు గుర్తుగల

బనియన్లు మరియు చడ్డీలు



మీకోసము ప్రత్యేకముగా

ది కర్నాటక నిట్టింగ్ కంపెనీ

Carnataka Knitting Co,

TIRUPUR - 638 602.

★

Sales Depot:

No. 4-6-213, PAN BAZAAR,

SECUNDERABAD - 500 003.

అప్పుడే అప్రయత్నంగా ఓ కన్నీటిచుక్క ఆమె చేతి మీద పడింది. చటుక్కున ఆమె అతని కళ్ళవైపు చూసింది.

వెంటనే మొహం ప్రక్కకి తిప్పుకుని చరచరా బయటకు వెళ్ళిపోయాడు ప్రేమ్‌కుమార్.

నిర్ఘాంతపోయి అటువైపే చూస్తూ వుండిపోయింది జయసుధ.

• • •

రోజు ఆదివారం.

కాలేజీకి శెలవు కాబట్టి జయసుధ యింట్లోనే వుంది.

ఉదయం ఎనిమిదన్నర కావస్తోంది.

జయసుధ స్నానంచేసి అప్పుడే వచ్చినట్లుంది. ఫేన్ గాలికి జుట్టారబోసుకుంటోంది.

ప్రభ పొరుగింటి జోగారావుగారమ్మాయి. సుజాత వద్దకు చదువుకోడానికని వెళ్ళింది.

తల్లి వంటింట్లో కుంపటిమీద పాలోళి పెట్టి కొళాయి వద్ద కూర్చుని అంట్లు తోముతోంది. తండ్రి చలపతిరావు కూరగాయలకని సంతకు వెళ్ళేడు.

జయసుధ జుట్టారబోసుకుంటూ పక్కనేవున్న రేడియో ఆన్ చేసింది.

'ఎదురుగా నీవుంటే, ఎన్నెన్ని రాగాలో.

చల్లనీ నీహృదయంలో, ఏ శ్రావణమేఘాలో.'

చక్కనైన సినీమాపాట వినబడింది.

ఆపాటంటే జయసుధకి చాలా యిష్టం. తనుకూడా ఆ పాటతో స్వరం కలిపి పాడుతూ ఎదురుగావున్న అద్దం సరిచేసుకుంది.

పాట పూర్తయ్యేలోపల వాలుజడ వేసుకుని. కనకాంబరాలూ, సంపెంగలతో అందంగా జడని అలంకరించుకుంది.

ఆపాట పూర్తయి రేడియోలో మరోపాట ప్రారంభమైంది.

అది అమరగాయకులు ఘంటసాలగారి మధురగానం. ఆంధ్రశ్రోతలను ముగ్ధులనుచేసే కంఠస్వరం:

'నీలి మేఘాలలో, గాలి కెరటాలలో

నీవు పాడేపాట, వినిపించు నీవేళా.'

జయసుధ ఎడంచేత్తో అద్దం పట్టుకుని తన అందమైన కళ్ళని కాటుకతో దిద్దుకుంది. నుదురుకి తిలకం బొట్టు పెట్టుకోగానే తలుపు గొళ్ళెం చప్పుడైంది.





Santhi Diamonds

Prop: B. K. N. Kannan

37, Big Sowrastra Street,

TIRUCHIRAPALLI - 620 008.

మేము అత్యుత్తమమైన పెర్‌లీన్ స్టార్ డబుల్ కటింగ్

సాంతిస్టార్ కమలములు మీ నగలకు అతి ప్రకాశాన్నిచ్చేరీతిగా

తయారిస్తున్నాము.

రసాయనిక వజ్రాలను తయారించుటలో

మా దొక ప్రత్యేకత.

'అమ్మాయి, చూడవే ఎవరో తలుపు కొడుతున్నారు' అంది వంటింట్లోంచి తల్లి.

'తీస్తున్నా.' అని జయసుధ లేచివెళ్ళి తలుపు తెరిచింది.

ఎదురుగా చక్రవర్తినిచూసి తడబడింది.

'మీ—మీరా—రండి. రండి.'

'నిన్న సాయంత్రమే వద్దామనుకున్నాను. కాని రాలేకపోయాను. ఇవాళ ఆదివారం కదా, అలా షైరులాకూడా అవుతుందని వచ్చేను.'

చిన్నగా నవ్వుతూ చక్రవర్తి లోపలికివచ్చి చుట్టూ కలయజూసాడు

అందంగా అలంకరించబడ్డ చిన్న గది.

గదిలో ఒకప్రక్కగా టేబిలు, దానిమీద ఫవర్‌వాజ్‌లో అందమైన రంగురంగుల పువ్వులు. టేబిల్‌మీదే రేడియో.

తలుపు కెదురుగా శ్రీ వెంకటేశ్వరస్వామి పెద్ద ఫ్రేము పఠం గోడకి అమర్చారు. ఆప్రక్కనే రకరకాల కేలండర్లు. పెయింటింగ్‌లూ చక్కగా అమర్చారు. ఆ అలంకరణం నూతనత్వం తొంగిచూస్తోంది. ఆ చక్రవర్తి ఆ అలంకరణను విస్మయంగా చూడసాగాడు.

'కూర్చోండి.'

'అం ?—ఓహ్ !'

జయసుధ మాటకి ఆలోచనలోంచి తేరుకుని ఈ లోకంలోకి వచ్చినట్లుగా కుర్చీమీద కూర్చున్నాడు చక్రవర్తి.

'ఇప్పుడే వస్తా.' అంటూ త్వరత్వరగా దువ్వెనా అద్దం తీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది జయసుధ.

చక్రవర్తి ఏమీ తోచనట్లు రేడియోవద్దనున్న పత్రిక తీసుకుని పేజీలు తిరగేస్తూ కూర్చున్నాడు,

రేడియోలో సినీమాపాటల కార్యక్రమం పూర్తయి బుచ్చిబాబుగారి వీణావాద్యం ప్రారంభమైంది. వినడానికి యింపుగా 'సామజవరగమనా' అను త్యాగరాజుకృతి !

అంతలో జయసుధ తల్లితో గదిలోకి రావడంతో చక్రవర్తి లేచి నిల్చున్నాడు.

'మా అమ్మగారు.' పరిచయం చేసింది జయసుధ.

'నమస్కారమండి.'

వినయంగా రెండుచేతులూ జోడించాడు చక్రవర్తి.

'కూర్చో, బాబూ, కూర్చో. మీరిద్దరూ ఒకే కాలేజీలో చదువుతున్నారని, నీవు చాలా తెలివైనవాడివని చెప్పింది జయ. చాలా సంతోషం బాబూ,'

ELLEN యెలెన్

మోటారు మరియు పంపులు

ఆంధ్ర ప్రభుత్వముచే అధికారము పొందియున్నది.



Totally Enclosed Monoblock
Manufacturers of :-
3 Phase Motors Pu mps, Domastic
Pumps Mono Bloeks



Open Type Monoblock
For PARTICULARS

ELLEN INDUSTRIES
Peelamedu, Coimbatore-641 004.

బ్రాంచి :

యెలెన్ ఇండస్ట్రీస్

7-3-177, ఘష్మండి, సికిందరాబాదు-3 (ఏ. పి.)

చక్రవర్తి దొంగచూపులతో జయసుధని చూసాడు.

ఆమె తనకేమీ తెలియనట్లు తల దించుకొని కాలి బొటన వేలు నేలకి రాస్తోంది.

'కూర్చో బాబూ.'

'ఆఁ.. కూర్చుంటానండి. మీరూ కూర్చోండి.'

'నాకు కూర్చోడానికి తీరికేది బాబు. చచ్చినంతపనుంది. అమ్మాయి జయా, కూర్చుని మాట్లాడమ్మా. నేను కాఫీ తెస్తాను.'

'అబ్బే, కాఫీ ఎందుకులెండి.' చక్రవర్తి కూర్చుంటూ అన్నాడు.

అతనిమాటలు వినకుండానే జయసుధ తల్లి వంటింటి వైపు దారి తీసింది.

'అమ్మా, మేము డాబామీద కూర్చుంటాము.' అని అతడిని తీసుకుని డాబామీదకి వెళ్ళింది.

తను ప్రేమ్‌కుమార్ వద్దకు వెళ్ళివుంటాడని ఆమెకి తెలుసు.

అతనితో ఎటువంటి సంభాషణ జరిగిందో తెలుసుకోవాలని ఆత్రుతగా వుందామెకి.

డాబామీద గదిలో యిద్దరూ కూర్చున్నారు.

జయసుధ అడుగుదామనుకునే లోపలే అతనన్నాడు, నిన్ననే ప్రేమ్‌కుమార్ యింటికి వెళ్ళేను. కాని అశుభ వార్తేమిటంటే, అతను ఈ ఊరు విడిచి అంతకుముందే వెళ్ళిపోయాడు.

'కారణం?'

'పరీక్షలు పూర్తిచేసి వెళ్ళమంటే కూడా వినలేదుట ప్రేమ్‌కుమార్. చెల్లెలు సుభద్ర ఒక దుర్ఘటనలో మరణించడం వల్ల ఈ ఊర్లో వుండాలంటేనే విరక్తి పుట్టిందట! పెద్దనాన్నగారి ఊర్లో ఏదో జాబ్‌లో చేరుతానని వెళ్ళిపోయాడుట.' అల్‌మేరాలోవున్న పుస్తకాలనిచూస్తూ అన్నాడు చక్రవర్తి.

'నిన్న మీరు వెళ్ళినతర్వాత కాలేజీలో ప్రేమ్ నాకు కనబడ్డాడు. నేను దబాయించాను. నచ్చచెప్పాను. నా లేఖలూ, ఫోటో యిచ్చేసాడు.'

'ఓ, అలాగా. కానీండి, ఎలాగైతేనేం. గండం గడిచింది. యికమీదనుంచి కాస్త జాగ్రత్తగా వుండటం మంచిది!'

'అంటే, నేను మళ్ళా ఎవరికైనా ప్రేమలేఖలు వ్రాస్తానని మీ అర్థం?' జయసుధ సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

చక్రవర్తి తడబడ్డాడు.

ఆమె చూపులని తప్పించుకుంటూ. 'అబ్బే, నేనలా అనలేదే!' అన్నాడు.

జయసుధ ముక్తసరిగా నవ్వింది.





మేము అతి నూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రానందకరమైన, జంకాళాలు మరియు బెడ్‌షీట్లను తయారించుచున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ ఆర్డరును వెంటనే గమనించి సప్లయి చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials**

**BHAVANI - 638 301.**

P. B. No. 38. Phone No.: 2 6 5

'అదేమిటండీ, అంతలా గాబరా పడిపోయారు?'

అంతలోనే తల్లి కాఫీ కప్పులతో ప్రత్యక్షమవ్వడంతో వారి సంభాషణ ఆగిపోయింది.

'పిలిస్తే నేనే వద్దును కదమ్మా!' అంది జయసుధ తల్లి చేతిలోంచి కప్పు లందుకుంటూ.

'ఎందుకండీ శ్రమ!'

'శ్రమేంవుంది బాబూ:'

'మీరు యింతకుముందు యింకెక్కడైనా వుండేవారండీ?' ఏదో ఒకటి అడగాలికదా అని అడిగాడు చక్రవర్తి.

చీరకొంగుతో చేతులు తుడుచుకుంటూ జయిసుధ తల్లి, 'అవును బాబూ, యింతకుముందు విజయవాడలో వుండేవాళ్ళం. అక్కడ జయా వాళ్ళ నాన్నగారు సేట్ రామ్‌లాల్ వద్ద పని చేసేవారు. అతడి బిజనెస్ బ్రాంచి యిక్కడొకటి ఓపెన్ చేసారు. ఆయనతో యిక్కడికి వచ్చేసాము. ఈ యిల్లు మావారు యిక్కడికి వచ్చినతర్వాత కొద్ది రోజులకే కొన్నారు.'

'మంచిదేనండి. మా కాలేజీకూడా ఆంధ్రలో ఒక మంచికాలేజీ అని పేరుబడినది. ముఖ్యంగా చదువులు చక్కగా సాగుతాయి.'

క్రిందనించి తలుపు చప్పుడు వినిపించింది.

'వస్తాను బాబూ. ఆయన వచ్చినట్లున్నారు.' అని ఆవిడ క్రింద కెళ్ళిపోయింది.

'కూర్చో చక్రవర్తి. నాన్నగారొచ్చినట్లున్నారు. యిప్పుడే వస్తాను,' అంటూ జయసుధకూడా తల్లి వెంటే వెళ్ళిపోయింది.

కొద్దిక్షణాల్లో తండ్రిని వెంటబెట్టుకుని వచ్చింది.

ఆమె పరిచయం చేయకుండానే చక్రవర్తి ఆమె తండ్రే అయివుంటాడని ఊహించుకున్నాడు. లేచి 'నమస్కారమండీ' అన్నాడు.

'కూర్చో, కూర్చోబాబూ. ఏమి పేరు చెప్పావు జయా. ఆం, చక్రవర్తికదూ. చక్కటిపేరు. చక్రవర్తిలా వెయ్యేళ్ళు వర్ధిల్లు నాయనా.' చలపతిరావు దీవిస్తూ అన్నాడు.

జయసుధ వాలుకుర్చీవేస్తే ఆయన కూర్చున్నాడు.

'నీవు చాలా తెలివైన విద్యార్థివని, ఎప్పుడూ కాలేజీలో ఫస్టేనని తెలిసింది. చూడు బాబూ, మా అమ్మాయి మెదడు వట్టి మట్టిముద్ద. కాస్త తీరిక చూసుకుని ఓ గంటో అర గంటో మా జయకీ ప్రభకీ పాఠాలు చెప్పరాదూ? నీకేమైనా అభ్యంతరమా.'

'అబ్బే, అభ్యంతరమేం లేదండి!'

'చూడు బాబూ, అంత ఎక్కువేం యివ్వలేను, కాని.'

ఆయన మాటలకి అభ్యంతరం చెప్పాడు చక్రవర్తి, 'అదుగో, అలా అయితే నేను రానే రానండి.'

'సరే, సరే. కోపం తెచ్చుకోకు బాబూ. అన్నట్లు మీ నాన్నగా రిక్కడే పని చేస్తున్నారుకదూ?'

జయసుధ ఖాళీ కప్పులని తీసుకుని క్రిందికి వెళ్ళింది.

'అవునండీ. మా నాన్నగారు కో-ఆప్‌రేటివ్ బేంక్‌లో ఎకౌంటెంట్‌గా వర్క్ చేస్తున్నారు.'

'మంచిది బాబూ, అన్నా చెల్లెళ్ళు.'

'లేరండి, నే నొక్కడినే'

'ఓ, అలాగా.'

ఆయన యింకేదో అనబోతూవుండగా జయసుధ తిరిగి వచ్చి, 'నాన్నా, అమ్మ పిలుస్తోంది' అంది.

'మరి నాకూ శెలవియ్యండి.'

ఆయనతోపాటే చక్రవర్తికూడా లేచాడు.

జయసుధ తల్లివద్దకూడా శెలవు తీసుకున్నాడు.

'మరిచిపోకు బాబూ కాస్తవచ్చి పాఠాలు చెప్తూవుండు' చలపతిరావు మరీ మరీ చెప్పాడు.

'తప్పకుండా వస్తానండీ. మీరింతగా చెప్పాలా?' అని బయల్దేరిన చక్రవర్తిని సాగనంపడానికి వచ్చింది జయసుధ.

'వస్తాను జయసుధగారూ!'

'ఆ 'గారూ' తీసిపారేయలేరా. మీకన్నా చిన్నదాన్ని. అదీకాక మీ శిష్యురాలినికూడా.' అంది చలాకీగా నవ్వుతూ జయసుధ.

'సరే, సరే. మరి వస్తా జయా.'

'రేపు వస్తారా?'

చక్రాల్లాంటి కళ్ళెత్తి అతణ్ణి చూసింది.

'తప్పకుండా. అంతకన్నా ముందు కాలేజీలో కలుసుకుంటాం కదండీ జయసుధగారూ!'

'అదుగో మళ్ళా 'గారు'!'

'ఓ. కే. అచ్చా జయా!'

'ఆం. అది. అలారండి దారికి. మరి నమస్తే.'

కుడిచేయి వూపి ముందు నడిచాడు చక్రవర్తి.

(సశేషం.)